సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 27 । జూలై । 2023



సరస్వతీ పుత్రులకు లక్ష్మీ కటాక్షం కరువు
పూట గడవడమే కష్టమైన తరుణం.. ఇక చదువుల ఫీజులంటే ఎంత కష్టం.. మనసున్న దాతల చేయూత కోసం ఎదురుచూస్తున్న సరస్వతీ పుత్రుల దీనగాథ. - 8లో



విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి
పెద్దదండ్లూరులో ఓ ఇంట్లో మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరు మృతిచెందారు. బుధవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. - 8లో

గరిష్టం/కనిష్టం
29.3 /24.3

వాతావరణం
జిల్లాలో బుధవారం 24.3 – 29.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు మెగా జాబ్‌మేళా

వైవీయూ : కడప నగరం బాలాజీనగర్‌లోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీ శుక్రవారం 8.30 గంటల నుంచి మెగా గ్రాండ్ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్, వైవీయూ పాలకమండలి సభ్యులు జి. సుబ్బారెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ కంపెనీల్లో దాదాపు 5వేల ఖాళీలకు సంబంధించి జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫ్రెష్, అనుభవం కలిగిన గ్రాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేట్లు, నాన్ గ్రాడ్యుయేట్లు సైతం నేరుగా జాబ్ ఫెయిర్‌కు హాజరుకావచ్చని తెలిపారు.

తహసీల్దార్ సస్పెన్షన్



తహసీల్దార్ రమేష్

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లె మండల తహసీల్దార్ రమేష్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయనతో పాటు టైపిస్ట్ అజయ్‌కుమార్‌ను కూడా విధుల నుంచి తొలగించారు. వీరిద్దరు రైతుల భూములకు సంబంధించి కేవలం నెలరోజుల వ్యవధిలోనే 89 మ్యుటేషన్‌లు నిర్వహించారు. మ్యుటేషన్‌లు నిర్వహణలో అవతవకలకు పాల్పడినట్లు పలువురు రైతుల నుంచి ఆరోపణలు రావడంతో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో 38 మ్యుటేషన్‌లకు సంబంధించిన రికార్డులు కార్యాలయంలో అందుబాటులో లేనట్లు తేలింది. దీంతో వీరిద్దరిని విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన నియామకం



టి. శివశంకర్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేకాధికారిగా టి.శివ శంకర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ నియమించారు. ఆయన ఇదివరకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. మొదటి నుంచి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరిగే బ్లడ్‌క్యాంపుల్లో 70 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

డీసీఈబీ సెక్రటరీగా శంకరయ్య



శంకరయ్య

కడప ఎడ్యుకేషన్ : జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) సెక్రటరీగా శంకరయ్య నియమితులయ్యారు. గతంలో పనిచేసిన శోభారాణి ప్రొద్దుటూరు ఎంఈఓ-2గా వెళ్లారు. శంకరయ్య కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసేవారు.

వైవీయూలో అధ్యాపకులకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన అధ్యాపకులతో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయానికి చెందిన నలుగురు అధ్యాపకులకు పదోన్నతులు కల్పిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీంలో భాగంగా నిర్వహించిన ఈ పదోన్నతులలో ముగ్గురికి ప్రొఫెసర్లుగాను, ఒకరికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. ఇందులో సహ ఆచార్యులుగా పనిచేస్తున్న జి. కాత్యాయని (అప్‌లైడ్ మ్యాథమాటిక్స్), డి. విజయలక్ష్మి (మైక్రోబయాలజీ), ఎం.ఎం. వినోదిని (తెలుగు)లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె. శ్రీనివాసరావుకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. వీరికి వీసీ సుధాకర్, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య నియామకపత్రాలను అందజేశారు.

ఫలితాలు విడుదల

యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ న్యాయ కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ ఫలితాలను బుధవారం వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి విడుదల చేశారు.

28న ఎక్సైజ్ వాహనాల వేలం

మదనపల్లె : మదనపల్లె స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) స్టేషన్ పరిధిలో గతంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్‌చేసిన వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలంపాట జరుగుతాయన్నారు. వివరాలకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్‌ను 9440902595 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పండుగలా వ్యవసాయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో పాల్గొన్న అధికారులు, దళిత రైతులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు విత్తన పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయం ఒక దండగ అని చెప్పగా తమ ప్రభుత్వం వ్యవసాయాన్ని ఓ పండుగలా మార్చిందని తెలిపారు. గత ప్రభుత్వం రుణ మాఫీ చేస్తామని చెప్పి మోసగించిందని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని దుయ్యబట్టారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రైతులకు అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు, గిడ్డంగులు, ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అలాగే చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ పేదలకు యాజమాన్య హక్కులు కల్పించామన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం పాలన సాగిస్తున్నారని కొనియాడారు. షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ద్వారా సేంద్రీయ పద్ధతులలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డ్ కులాల రైతులకు రూ.10 వేలు విలువగల విత్తనాలు, ఉపకరణములు సబ్సిడీగా మంజూరు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు, శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ మదగలం శ్రీనివాసులు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.శివ ప్రసాద్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకట సుబ్బయ్య, డీపీఎం పి రామకృష్ణ రాజు, అదనపు డీపీఎం వసంత కుమారి పాల్గొన్నారు.

మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష

మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేసి అభివృద్ధి బాటలో నడిపించాలని సూచించారు.

మైదుకూరు నియోజకవర్గంపై..

మైదుకూరు నియోజకవర్గంలో వ్యవసాయ, మార్కెటింగ్ రంగాల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి అన్నారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించడం అభినందనీయమన్నారు. పాడిపంటలు, పశుసంపద, మార్కెటింగ్ రంగాలను మరింత పటిష్టం చేసి మైదుకూరుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనినియోజకవర్గంలో జరుగుతున్న ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు, జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించిన సమస్యలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపడుతున్న పనులు ఖరీఫ్‌లో పంటల సాగు, విత్తనాలు, ఎరువుల సరఫరా వివరాలు కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలిపారు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి 11 కేసులకు పరిహారం అందించామన్నారు.

సీఎం చొరవతోనే..

వ్యవసాయ, ఉద్యాన పంటలకు పేరెన్నికగన్న మైదుకూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్, సంబంధిత జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు చేస్తున్న కృషి, సహకారం ప్రశంసనీయమన్నారు.

బద్వేలు సమీక్షలో..

బద్వేలు నియోజకవర్గ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలతో బద్వేలు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకు ముందు కలెక్టర్ వి.విజయ్ రామరాజు బద్వేలు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఎల్ఎస్‌పీ స్పిల్ వే గేట్ల పునర్నిర్మాణం కోసం చేపట్టిన పనులు 80 శాతం పూర్తయిందన్నారు. వీటితోపాటు బి.కోడూరు, బద్వేలు మండలాల్లో చెరువుల రిహాబిలిటేషన్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అనంతరం నియోజకవర్గంలో వివిధ శాఖల వారీగా ఉన్న సమస్యలను, అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలను ప్రజాప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

పట్టాలిస్తే పేదలకు మేలు..

వేలాది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమల కారిడార్‌గా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. పేదలకు అసైన్డ్ భూములే ఉన్నాయని వారందరికీ పట్టాలు ఇచ్చేలా చర్యలు చేపడితే పేదలకు మేలు చేసినవారమవుతామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ నియోజకవర్గంలో జలాశయాల్లో పూర్తిస్థాయి నీటి మట్టంతో కలకళాలడుతున్నాయంటే.. అది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిగారి కృషి. పట్టుదల, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సహకర ఫలితమే అన్నారు.

కిలో రూ.168

మదనపల్లె మార్కెట్‌లో టామాటాకు రికార్డుస్థాయి ధర

మదనపల్లె : మదనపల్లె మార్కెట్‌చరిత్రలో పాత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతూ... బుధవారం మొదటిరకం టమాటా కిలో రూ.168 ధర పలికింది. 45 ఏళ్ల మార్కెట్‌కమిటీ చరిత్రలో ఈ ఏడాది పలికినంత ధరలు గతంలో ఎన్నడూ లేకపోవడం విశేషం. మదనపల్లె మార్కెట్‌కు బుధవారం రైతులు మొత్తం 361 మెట్రిక్‌టన్నుల టమాటాను తీసుకువస్తే....వాటిలో మొదటిరకం కిలో రూ.140–168 మధ్య, రెండోరకం కిలో రూ.118–138 వరకు వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. టమాటా ధరలు రోజురోజుకీ పైకి పోతుంటే...పంట పొలాల్లో మాత్రం దిగుబడులు తగ్గిపోతున్నాయి. మూడురోజులుగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం.. ముసురువాన, వాతావరణం తేమగా ఉండటంతో దిగుబడులు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. దేశంలో టమాటా పండించే రాష్ట్రాల్లో వర్షాలు అధికం కావడం, పంట పండకపోవడం, కర్ణాటకలో ఆకుమచ్చ తెగులు, వైరస్ సోకడంతో దిగుబడులు పూర్తిగా పడిపోయాయి. దేశం మొత్తం మీద ప్రస్తుతం టమాటా మదనపల్లె, పలమనేరు, పుంగనూరు, గుర్రంకొండ, అంగళ్లు, ములకలచెరువు.. కర్ణాటకలోని కోలారు, వడ్డిపల్లె మార్కెట్లలో మాత్రమే లభ్యమవుతోంది. దేశవ్యాప్తంగా టమాటాకు ఉన్నటువంటి డిమాండ్ దృష్ట్యా ఢిల్లీ, పశ్చిమబెంగాల్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు ఈ ప్రాంతాల్లో మకాం వేసి అధిక ధరలకు టమాటాను కొనుగోలు చేస్తున్నారు. వచ్చిన సరుకు వచ్చినట్లే అధిక ధరలకు అమ్ముడవుతుండటంతో తీసుకొచ్చిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో మదనపల్లె మార్కెట్లో రైతుల నుంచి సగటున కిలో రూ.104 చొప్పున టమాటా కొనుగోలు చేసి రైతు బజార్లలో సబ్సిడీధరలకు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తోంది. ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న టమాటా ధరలు మరో నెలవరకు ఇలాగే కొనసాగుతాయని, అప్పటికి మదనపల్లె మార్కెట్‌లో సీజన్ పూర్తయితే అనంతపురం, డోన్, గుత్తి మార్కెట్లలో సరుకు లభ్యత వస్తుందన్నారు.

కడపకు చేరుకున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

కడప అర్బన్: రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి డీజీపీ కె. రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం రాత్రి కడపకు చేరుకున్నారు. కర్నూలు నుంచి రోడ్డు మార్గాన వచ్చిన ఆయన్ను కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్ వద్ద పోలీసు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు అధికారులతో డీజీపీ నేర సమీక్ష నిర్వహించారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, ఎర్రచందనం అక్రమ రవాణా, మహిళలపై జరిగిన నేరాలు, ఇతరత్రా నేరాలపై పోలీస్ సబ్ డివిజన్‌ల వారీగా అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారం చూపాలన్నారు. 'దిశ' పోలీసులు మహిళలు, చిన్నారుల పట్ల జరుగుతున్న నేరాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో కర్నూలు-కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, వైఎస్సార్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. గురువారం ఉదయం డీజీపీ మీడియా సమావేశం నిర్వహించనున్నారు.



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పోలీసు అధికారులు

జిల్లాలో జోరు వానలు

- ఎడతెరిపిలేకుండా కురుస్తున్న జల్లులు
- చెన్నూరులో అత్యధికంగా 38.8 మి.మీ వర్షపాతం నమోదు
- బయటకు వచ్చేందుకు జనాల అవస్థ
- విత్తనాల సాగుకు అనుకూలం



షాపులో రైతుల కోసం సిద్ధం చేసిన విత్తన వడ్ల

కడప అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా వానలు పడుతున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయ్. బుధవారం రోజంతా వాన జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో జనాలు బయటకు వచ్చేందుకు అవస్థలు పడ్డారు. ఇక కార్యాలయాలకు వెళ్లే సిబ్బంది, పాఠశాలలకు పోయే చిన్నారులు సైతం వర్షంతో తిప్పలు పడ్డారు. కడప నగరంలో అక్కడక్కడ వర్షపు నీటి నిలువలు అలాగే ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా రోజుల తరువాత కురిసిన అధిక వర్షం ఇదే కావడంతో ఖరీఫ్ వ్యవసాయానికి మాత్రం మేలు జరగనుంది. ఈ వర్షంతో చాలా మంది రైతులు జీలుగలు, జనుముల తోపాటు ఆరుతడి పంటలైన వేరుశనగ, మినుము, కొర్రవంటి పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. వీటికితోడు నదీ పరివాహక ప్రాంతాలతో పాటు బోర్ల కింద కొంత మంది రైతులు నారు మడులను సాగుచేసుకునే అవకాశం ఏర్పడింది. దీంతో చాలా మంది రైతులు విత్తనాలను వండ్లను షాపుల నుంచి తీసుకెళ్లుతున్నారు. వర్షం కాస్త తెరిపిస్తే వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని పలువురు రైతులు తెలిపారు.

చెన్నూరులో అత్యధికంగా...

జిల్లాలో చెన్నూరులో అత్యధికంగా 38.8 మి.మీ వర్షం కురిసింది. అలాగే సిద్దవటంలో 30.2 మి.మీ , కడపలో 28.2 మి.మీ, కమలాపురంలో 25.2మి.మీ, ఖాజీపేటలో 24.8, వల్లూరులో 22.4, అట్లూరులో 22, ఎర్రగుంట్లలో 18.8, మైదుకూరులో 17, కలసపాడు 15.4, సీకే దిన్నె 15.2, చాపాడులో 12.6, ప్రొద్దుటూరులో 12.4, కాశినాయనలో 12.2, సింహాద్రిపురంలో 11.2, మైలవరం 10.4, దువ్వూరు, గోపవరం, ముద్దనూరులలో 10.2, జమ్మలమడుగులో 9.4, కొండాపురంలో 8.6, రాజుపాలెంలో 8.4, బద్వేల్‌లో 8 మి.మీ వర్షపాతం నమోదయింది.

ప్రాజెక్టుల నీటి నిల్వ వివరాలు

కడప సిటీ : వర్షాలకు జిల్లాలోని ఆయా ప్రాజెక్టులు కొంతమేర జలకళ సంతరించుకున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీరు విడుదల కానప్పటికీ వర్షపు నీరు ప్రాజెక్టులలోకి వచ్చి చేరుతోంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఆయా ప్రాజెక్టుల నీటి సామర్థ్యం 84.489 టీఎంసీలుగా ఉంది. అయితే ప్రస్తుతం ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వ 49.812 టీఎంసీలుగా నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రాజెక్టు పేరు	పూర్తి సామర్థ్యం (టీఎంసీలలో)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీలలో)	ఇన్‌ఫ్లో (క్యూస్కెలు)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కులు)
ఎస్ఆర్-1	2.134	0.298	--	12
ఎస్ఆర్-2	2.447	0.898	--	10
బ్రహ్మంసాగర్	17.730	9.743	--	404
గండికోట	26.850	20.615	200	600
మైలవరం	6.500	3.447	--	666
వామికొండ	1.658	1.056	--	05
సర్వరాయసాగర్	3.060	0.815	--	20
చిత్రావతి	10.229	6.059	--	355
పైడిపాలెం	6.000	2.712	600	110
లోయర్ సగిలేరు	0.169	0.001	--	--
బుగ్గవంక	0.51	0.064	--	--
వెలిగల్లు	4.64	4.10	--	26
పింఛా	0.327	0.002	--	--

చిత్తశుద్ధితో హామీల అమలు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్త శుద్ధితో అమలు చేశారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని సీఎం జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలకు మేలు జరగుతుంటే చూడలేని ప్రతిపక్ష పార్టీలు తమ ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని నిత్యం ప్రభుత్వంపై బురదజల్లే విషపు రాతలు రాయిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పేదలకు మంచి చేసే పథకాలంటే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు ఇష్టముండదని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజలను మోసగించడమే నైజంగా చంద్రబాబు తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారని తూర్పారబట్టారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు.

రాయితీతో విత్తనాలు అందించండి.. రబీ పంట సోయా చిక్కుడు విత్తనాలు రాయితీపై ఇప్పించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సింహాద్రిపురం మండల రైతులు కోరారు. అలాగే 2023కు సంబంధించి చీనీ పంటల బీమా ఈ-క్రాప్ చేసుకుని ఈకేవైసీ సర్వర్ ప్రాబ్లమ్‌వల్ల దాదాపు 500మంది రైతులకు బీమా అందలేదని వారికి బీమా అందేలా చూడాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించారు.

జీతాలు ఇప్పించండి..

తమకు 8నెలలుగా జీతాలు అందలేదని స్వచ్ఛాంధ్ర (చెత్త సేకరణ) ఆటో కార్మికులు ఎంపీకి విన్నవించుకున్నారు. దీనికి ఎంపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సపరేట్ బడ్జెట్ ఏర్పాటు చేసి జీతాలు అందేలా చూస్తానని ఎంపీ భరోసా ఇచ్చారు.

చిన్నరంగాపురం ఎస్సీ కాలనీ ప్రజలు కలిసి తమ కాలనీలోని శ్రీరా ముని ఆలయం పునఃనిర్మాణానికి సహకరించాలని ఎంపీని కోరారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

సంబేపల్లె : మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు విరివిగా నాటాలని ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) కమాండెంట్ అమిత్‌భాటియా అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుట్టపల్లె అంకిరెడ్డిగారిపల్లె సచివాలయం ప్రాంగణంలో ఏపీ క్రియేటీవిటీ, కల్చరల్ అకాడమి బోర్డు మెంబర్ నిర్మలాదేవితో కలిసి మొక్కలు నాటారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సిద్ధవటం : అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా జనార్దన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో పోలీసు స్టేషన్ ఎస్‌ఐ పరుషోత్తం బాబు తెలిపారు. కొత్త మాధవరానికి చెందిన జనార్దన్ బుధవారం ముమ్మడిగుంటపల్లె క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా తాము గమనించి అరెస్టు చేశామన్నారు. అతని వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని ఆయన పేర్కొన్నారు.

కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

లింగాల : లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కడుపు నొప్పి తాళలేక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ ప్రభాకర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గంగిరెడ్డి గోవర్దన్‌రెడ్డి భార్య గంగిరెడ్డి మమత (30) గత కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. మంగళవారం అర్ధరాత్రి కడుపు నొప్పి ఎక్కువ కావడంతో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సరస్వతీపుత్రులకు లక్ష్మీకటాక్షం కరువు!

- కుటుంబ పెద్ద మృతితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లీకొడుకులు
- సీఏ చదువుతున్న అన్నదమ్ములు
- దాతలు సహకరిస్తే చదువులు సజావుగా సాగుతాయని వేడుకోలు

కడప ఎడ్యుకేషన్ : భర్త అకాల మరణం.. మీద పడిన కుటుంబ భారం.. అటు చూస్తే కనాకష్టంగా సాగుతున్న పిల్లల చదువులు.. ఇటు చూస్తే పూట గడవడమే కష్టమైన తరుణం. ఈ పరిస్థితుల్లో ఆర్థికంగా చేయూతనందించే మనసున్న మనుషుల కోసం ఎదురుచూస్తున్నారు ఆ తల్లీ బిడ్డలు..

కడప రవీంద్రనగర్‌కు చెందిన వెన్నపూస శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీదేవి దంపతులు వేముల మండలం కుప్పకుంట్లపల్లె నుంచి 28 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం కడపకు వచ్చి స్థిరపడ్డారు. అప్పటి నుంచి వెన్నపూస శ్రీనివాసులరెడ్డి కుట్టుమిషన్ కుట్టుకుంటూ ఇద్దరు కుమారులతోపాటు భార్యను పోషించుకుంటూ జీవనాన్ని సాగించేవాడు. వారి ఇద్దరు కుమారులైన వెన్నపూస యుగంధర్‌రెడ్డి, వెన్నపూస రాజేష్‌రెడ్డిల చదువులు ఇంటర్మీడియట్ వరకు సజావుగా సాగాయి. ఆ తరువాత ఒకరేమో ఇంటర్ తరువాత సీఏలో (చార్టర్డ్ అకౌంటెంట్) చేరగా మరొక అబ్బాయి డిగ్రీ పూర్తి చేసి సీఏలో చేరాడు. ఈ క్రమంలోనే ప్రశాంతంగా సాగుతున్న వారి జీవితంలో ఒక్కసారిగా విషాదం చోటుచేసుకుంది. కుటుంబ పెద్ద శ్రీనివాసులరెడ్డి


మిషన్ కుడుతున్న లక్ష్మీదేవి

క్యాన్సర్ బారిన పడి గత ఏడాది ఏప్రిల్‌లో మృతి చెందాడు. భర్త మృతితో కుటుంబ భారమంతా ఒక్కసారిగా లక్ష్మీదేవి మీద పడింది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని ఆ తల్లి కొన్ని రోజులు హోటల్‌లో పనిచేసి వచ్చిన డబ్బుతో కుటుంబ పోషణతోపాటు పిల్లల బాగోగులను చూసుకుంది. తరువాత ఆమె కూడా అనారోగ్య పరిస్థితుల కారణంగా ఆ పని మానేసి గతంలో తన భర్త చేసే కుట్టుమిషన్ పనిని ప్రారంభించింది. లంగాలు కుడుతూ వచ్చే కమీషన్, ప్రభుత్వం ఇచ్చే వితంతు పెన్షన్‌తోనే బతుకుబండిని లాగుతోంది.

చదువు పరంగా ఇలా..

వెన్నపూస శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీదేవిల పెద్ద కుమారుడు యుగంధర్‌కు పదవ తరగతిలో 10 పాయింట్లకు 8.8 వచ్చాయి. అలాగే ఇంటర్మీడియట్‌కు సంబంధించి 1000 మార్కులకు 948 మార్కులు రాగా చార్టెడ్ అకౌంట్ కోర్సుకు సంబంధించి ఫౌండేషన్ లెవెల్‌లో 200 మార్కులకు 129


తల్లి లక్ష్మీదేవితో కుమారులు యుగంధర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి

మార్కులు వచ్చాయి. అలాగే రెండవ కుమారుడు రాజేష్ రెడ్డికి పదవ తరగతిలో 9.8 పాయింట్లు, ఇంటర్మీడియట్‌లో 9.6 పాయింట్లు రాగా డిగ్రీ బీకాం కంప్యూటర్ కోర్సులో ప్రథమ సంవత్సరంలో 7.53, ద్వితీయ సంవత్సరంలో 7.65, తృతీయ సంవత్సరంలో 7.56 పాయింట్లు మార్కులు వచ్చాయి. ప్రస్తుతం ఈ అబ్బాయి సీఏలో చేరాడు.

ఒడిదుడుకుల మధ్య సాగుతున్న విద్య..

తండ్రి మరణంతో ఇరువురు కుమారుల చదువులు ఒడిదుడుకుల మధ్య సాగుతున్నాయి. ప్రస్తుతం వీరు కడపలోని ఒక స్టడీ సెంటర్‌కు వెళ్లి నెలకు రెండు వేలు చెల్లించి చదువుకుంటూ సీఏకు ప్రైవేటుగా ఫీజు చెల్లించి పరీక్షలను రాస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఈ పిల్లలకు ఎవరైనా దాతలు చేయూతనందిస్తే చదువులు ప్రశాంతంగా సాగి ప్రయోజకులవుతారు. తమను ఆదుకోవాలని ఆ కుటుంబం మనసున్న మారాజులను వేడుకుంటోంది.

ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని ఫిర్యాదు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామ సమీపంలో కె. రమణారెడ్డి అనే వ్యక్తి 25 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించాడని అదే గ్రామానికి చెందిన అన్నెం లక్ష్మీదేవి ఆరోపించారు. బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఫిర్యాదుదారురాలి భర్త వెంకటసుబ్బారెడ్డి మరి కొంతమంది రైతులు విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లె సర్వేనెంబర్ 130 నుంచి 140 వరకు 8మంది రైతులకు పట్టా భూములు ఉన్నాయన్నారు. తమ భూములు దాటిన తరువాత ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. రమణారెడ్డి కేవలం ఒకరి దగ్గర 5 ఎకరాలు డీకేటీ భూమిని కొనుగోలు చేసి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్రమించుకున్నాడని తెలిపారు. భూమికి దారి కావాలని 40 అడుగుల వెడల్పుతో జేసీబీ ద్వారా రెండు రోజులుగా రాత్రిపూట రోడ్డు వేస్తున్నాడని పేర్కొన్నారు. ఆ రోడ్డులో తమ పట్టా భూములు ఉన్నాయని తాము అడిగితే మహిళలని చూడకుండా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డిల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇదే విషయమై రోడ్డు పనులు ఆపి ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎస్‌ఐలకు ఫిర్యాదు చేసినట్లు లక్ష్మీదేవి మరికొంతమంది రైతులు తెలిపారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి

- కర్నూలు–కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్
- కడపలో డీఎస్పీ, ట్రాఫిక్, 'దిశ' పోలీస్ స్టేషన్‌ల తనిఖీ

కడప అర్బన్ : కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఆయా పోలీసు కార్యాలయాల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కర్నూలు– కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కడప నగరంలో పర్యటించారు. తొలుత పోలీస్ అతిథి గృహం నుంచి నేరుగా జిల్లా పోలీసు కార్యాలయం, 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌ను సందర్శించారు. తరువాత కడప డీఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు.

■ కడప డీఎస్పీ కార్యాలయం తనిఖీ అనంతరం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి కడప సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి స్మగ్లింగ్‌పై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

■ తరువాత కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించి ట్రాఫిక్


మాట్లాడుతున్న కర్నూలు- కడప రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్, పక్కన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాధాన్యతను వివరించాలన్నారు.

■ కడప నగరంలోని 'దిశ' మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి మాట్లాడుతూ మహిళల నేరాలకు సంబంధించి కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖలు మహిళల భద్రతే ప్రాధాన్యతగా పనిచేస్తున్నాయన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కేసులను పరిశీలించి పలు సూచనలు చేశారు. 'దిశ' యాప్‌ను మహిళలందరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప 'దిశ' మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమాకాంత్, సీఐ వినయ్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని పెద్దకారంపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం కారంపల్లి(మన్నూరు) సుబ్బారెడ్డి, మన్నూరు రామసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి వారసులు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. స్కాట్‌లాండ్‌లో వైద్య వృత్తిలో స్థిర పడిన మన్నూరు కుటుంబానికి చెందిన వైద్య నిపుణులు డాక్టర్ మన్నూరు కేశవరెడ్డి, డాక్టర్ కౌశల్యరెడ్డి, డాక్టర్ సోనియారెడ్డి నీమకళ్లు, డాక్టర్ సురేఖరెడ్డి నీమకళ్లు ప్రజలకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి పాల్గొని


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

వైద్యులను సన్మానించారు. నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నూరు అశ్వత్థామరెడ్డి, మన్నూరు భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ వైద్య శిబిరంలో దాదాపు 400 మందికి పైగా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

అట్లూరు : మండలంలోని కొండూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా సమన్వయకర్తగా డబ్బుగొడ్డు రమణయ్య, జిల్లా అధ్యక్షుడుగా బుర్రి రాజగోపాలయ్య, జిల్లా ఉపాధ్యక్షులుగా చెవులరమణయ్య, ఎం.మల్లెంకొండయ్య, వై.అయ్యవారయ్య, ఎస్.చిన్న ఓబులేసు, బి.గంగయ్య, జి.వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా రామనరసింహులు, కార్యదర్శులుగా పూజారి శ్రీనివాసులు, ఎం.వీరయ్య, వి.పెద్ద ఓబులేసు, సి.అంకయ్య, బి.కొండయ్య, ఎస్.వెంకటశివ, బి.క్రిష్ణయ్య, సి.చంద్రశివ, కె.హరిప్రసాద్, జిల్లా కోశాధికారిగా బుర్రి వేణుగోపాల్ యాదవ్, జిల్లా యువజన అధ్యక్షుడిగా పోలుబోయిన వెంకటేశ్వర్లు, బద్వేలు టౌన్ అధ్యక్షుడిగా


నియామక పత్రాలతో బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు

పామూరు వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంచెపు వీరయ్య మాట్లాడుతూ జిల్లాలో బీసీలకు ఎక్కడ అన్యాయం జరిగినా న్యాయం జరిగేంత వరకు పోరాడతామని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో ఐదుగురు సిబ్బంది సస్పెన్షన్

బ్రహ్మంగారిమఠం: మండలంలోని మద్దిరెడ్డిపల్లె దగ్గర ఉన్న కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు జీసీడీఓ విజయలక్ష్మి తెలిపారు.

ఈనెల 23న 7వతరగతి చదువుతున్న అబీషా అనే బాలిక అస్వస్థతకు గురైనా సిబ్బంది పట్టించుకోకపోవడంతో విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు ఆందోళన చేశారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరించిన నైట్‌వాచ్‌మన్ ఎస్.రాజేశ్వరి, అటెండర్ ఎస్.లక్ష్మీదేవి, వంట మనుషులు మరియమ్మ, రామసుబ్బమ్మ, స్వీపర్ రాజమ్మలను సస్పెండ్ చేశారన్నారు.


క్షతగాత్రులకు ప్రభుత్వ ఆర్థిక సాయం

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని చిన్నఓరంపాడు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అందజేశారు. బుధవారం మేడా భవన్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితులు ఉమర్‌హమీద్‌కు రూ.2లక్షలు, ఏనుగుల శంకరయ్యకు రూ.2లక్షలు ప్రభుత్వం నుంచి మంజూరైందన్నారు. ఆ చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో రాజంపేట తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి (యువజనవిభాగం) తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, నందలూరు మండల నాయకుడు అన్నం నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సు ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కృష్ణ సర్కిల్ సమీపంలో ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఎవరైనా ఆ మృతదేహం ఆచూకీ తెలిసిన వారు 91211 00510 నంబరులో సంప్రదించాలని కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు సూచించారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

వ్యక్తికి తీవ్ర గాయాలు..

ఖాజీపేట: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. భూమాయపల్లెకు చెందిన చెప్పలి బాబు అనే వ్యక్తి ఖాజీపేటలో తన పని ముగించుకుని ఇంటికి బయలు దేరాడు. బుడ్డాయపల్లె దగ్గర ఉన్న మాడల్ స్కూల్ వద్దకు రాగానే వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. దీంతో అతను కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయింది. గాయపడిన వ్యక్తిని బంధువులు కడపలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

స్కూల్ వ్యాన్ ఢీ కొని..

కమలాపురం : పట్టణంలోని రెడ్డీస్ కాలనీకి చెందిన చింతా కొండారెడ్డి (65) అనే వ్యక్తిని ఓ స్కూలు వ్యాన్ ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొలకవారిపల్లెకు చెందిన కొండారెడ్డి గత కొంత కాలంగా కమలాపురంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం పనిపై బయటకు వచ్చిన కొండారెడ్డి ఇంటికి తిరిగి వెళ్తుండగా భారత్ ఏజన్సీస్ వద్ద రోడ్డు దాటుతుండగా రైల్వే గేటు వైపు పట్టణంలోనికి వస్తున్న స్కూల్ వ్యాన్ ప్రమాదవశాత్తు ఢీ కొంది. ఈ ఘటనలో మృతుడు రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందిస్తుండగానే మృతి చెందాడు. కాగా మృతునికి భార్య సరస్వతి, కుమారుడు రామనాథరెడ్డి, వివాహిత కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


మృతుడు చింతా కొండారెడ్డి

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. అంగళ్లు పంచాయతీ దొమ్మన్నబాయికి చెందిన రమణ భార్య ఎస్.నీలారాణి(40) కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటోంది. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల ఆహారం విషయంలో రాజీ పడొద్దు

లింగాల : పిల్లల ఆహారం విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న బాలయోగి ప్రతిభా గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల హాస్టల్‌లోని వంట గదిని, నిత్యావసర సరుకుల నిల్వలను, విద్యార్థులకు అందించే మెను చార్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థుల భోజన విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల సమావేశం నిర్వహించి భోజన, తదితర వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో కేర్ టేకర్ మాధవీలత, సీనియర్ అసిస్టెంట్ సురేష్, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొనారు.


కేర్ టేకర్ మాధవీలతతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

భారతి సిమెంట్‌తో నాణ్యమైన కట్టడాలు

సింహాద్రిపురం : భారతి సిమెంటుతో నాణ్యమైన కట్టడాలు నిర్మించవచ్చని భారతి సిమెంటు కంపెనీ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రమైన సింహాద్రిపురంలో భారతి సిమెంటు కంపెనీ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి సిమెంటు అత్యాధునిక ప్రమాణాలు పాటించడం వలన నాణ్యమైన సిమెంటును అందిస్తోందన్నారు. తద్వారా తాపీ మేస్త్రీలు, వినియోగదారుల మన్ననలు పొంది నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. పీపీసీ వాడకం వల్ల కట్టడాలలో నాణ్యత పెరుగుతోందని.. నిపుణులచేత గుర్తింపు పొందిందన్నారు. జిల్లా సేల్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారతి సిమెంటు వాడకం వల్ల కలిగే లాభాలను వారికి తెలిపారు. అనంతరం తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్వరూప ఏజెన్సీ డీలర్ ఆర్. మల్లికార్జునరెడ్డి, సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.


తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లు, బహుమతులను అందజేస్తున్న భారతి సిమెంటు కంపెనీ ప్రతినిధులు

పార్సిల్ సర్వీస్‌పై విజిలెన్స్ అధికారుల దాడి

కడప అర్బన్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు అధికారుల బృందం బుధవారం కడప నగరంలోని మాచుపల్లి బస్టాండ్ రోడ్డులో కనకదుర్గా పార్సిల్ సర్వీస్‌లో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.2,12,000 విలువైన ఎల్‌ఆర్ బిల్లులు లేని 12 పార్సిళ్లను సీజ్ చేసి వాణిజ్య పన్నుల శాఖ వారికి అప్పగించారు. ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ బిల్లులు లేకుండా రవాణా చేయడం నేరమని, నిషేధిత వస్తువులను రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని షేక్ మాసుంబాషా హెచ్చరించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ జి. ఈదురుబాషా, డీసీటీఓ వి. మోహన్‌కుమార్, ఏసీటీఓ జి. ధనుంజయ, సీనియర్ అసిస్టెంట్, విజిలెన్స్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ ఎస్. జనార్దనరావు, కానిస్టేబుల్ కె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పార్సిల్ సర్వీస్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

రాయచోటిటౌన్ : హోం వర్క్ సరిగా చేయలేదని ఓ విద్యార్థిని చితకబాదిన సంఘటన రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బుధవారం చోటు చేసుకొంది. రాయచోటి పట్టణంలోని వేద వ్యాస పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఉస్మాన్ ఖాన్ హోం వర్క్ సరిగా రాయలేదని ఉపాధ్యాయుడు కర్రతో వీపుపై వాతలు వచ్చేలా కొట్టాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాయచోటి ఎంఈఓ ఈశ్వర నాయక్‌ను డీఈఓ శ్రీరాం పురుషోత్తం ఆదేశించారు.